క్లుప్తంగా

అక్షితలకు ప్రత్యేక పూజలు



పవిత్ర అక్షితలను ప్రదర్శిస్తున్న దృశ్యం

కౌతాళం: అయోధ్యలో భగవాన్ రామ్‌లల్లా విరాజ్‌మాన్ పవిత్ర అక్షితలకు మండల కేంద్రంలో బుధవారం ప్రత్యేక పూజలు చేయించామని విశ్వహిందూ పరిషత్ మండల నాయకుడు చంద్రశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి మండలాల్లోని ప్రఖండాలకు అందజేయాలని జిల్లా నాయకులు అర్ధగేరి బసవన్నగౌడ్, హనుమంతరెడ్డి తమకు అందజేసినట్లు చెప్పారు. వీటిని స్థానిక దేవాలయాల్లో పూజలు నిర్వహించి అయోధ్య రామమందిర ట్రస్టు వారు నిర్ణయించిన పద్ధతిలో ఇంటింటికీ అందజేస్తామన్నారు.

నేడు బదినేహాల్‌లో 'జగనన్నకు చెబుదాం'

కౌతాళం: మండలంలోని బదినేహాల్ గ్రామంలో గురువారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ స్థానిక పంచాయతీ భవనంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు. అలాగే సుళేకేరి గ్రామంలో సంక్షేమ పథకాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

ప్రాంగణ నియామకాల్లో 11 మంది ఎంపిక

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీటెక్ తదితర డిగ్రీలు పూర్తి చేసిన అభ్యర్థులకు బుధవారం ప్రాంగణ నియామకాలు చేట్టారు. కళాశాల కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ వైస్ ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ ఆల్ సెక్ టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధులు బాబాఫకృద్దీన్,అక్రమ్ సమక్షంలో విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు, గ్రూపు డిష్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. 92 మంది విద్యార్థులు పాల్గొనగా 11 మంది ఎంపిక చేసుకున్నారని చెప్పా రు. అనంతరం కంపెనీ ప్రతినిధులను సన్మానించారు. కళాశాల చైర్మెన్ విట్టా సతీష్ , ప్లేస్‌మెంట్ అధికారి రామకృష్ణ,అధ్యాపకులు పాల్గొన్నారు.


వెయిట్ లిఫ్ట్‌లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: ఆదోని ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వీరేష్ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడని కళాశాల యాజమాన్యం బుధవారం తెలియజేశారు. కరస్పాండెంట్ దైవాదీనం రెడ్డి, చైర్మెన్ విట్టా సతీష్ విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపాల్ మురళీ మోహన్ మాట్లాడుతూ ఈ నెల 20, 21వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరేష్ ఉత్తమ ప్రతిభ చూపడంతో బంగారు పతకం లభించిందన్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొని 250 కేజీల వరకు లిఫ్ట్ చేశాడని చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్, వ్యాయమ ఉపాధ్యాయుడు ఎర్రిస్వామి పాల్గొన్నారు.

కర్ణాటక విద్యార్థిని అప్పగింత



తండ్రికి బాలికను అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

మంత్రాలయం : కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన మనోహర్ కుమార్తె జయప్రియ తప్పిపోగా రైల్వే పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. జయప్రియ బళ్లారిలో 8వ తరగతి చదువుతుంది. తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు తెలియకుండా బుధవారం ఉదయం రైలెక్కి మంత్రాలయం మండలంలోని తుంగభద్ర రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఒంటరిగా ఉన్న బాలికను రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ సిద్దారెడ్డి, రైల్వే పోలీసులు గుర్తించారు. బాలికను విచారించి తండ్రికి సమాచారం చేరవేశారు. అయితే కుమార్తె కనిపించడం లేదని అక్కడ తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. రైల్వే పోలీసుల సమాచారంతో ఇక్కడికి చేరుకోగా బాలికను తండ్రికి అప్పగించారు.

25న ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలతో పాటు దోష పరిహార పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే శనీశ్వరస్వామికి తైలాభిషేకం నిర్వహిస్తామన్నారు. వివరాలకు సెల్ 9985706489 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రీ సర్వేతో భూములకు రక్ష

ఏ గ్రామంలోకైనా అధికారులు ప్రవేశిస్తే చాలు.. స్థానికులు ప్రధానంగా ప్రస్తావించే సమస్య భూ సమస్య. ఒక గ్రామం నుంచి పది వినతులు అందితే అందులో దాదాపు 8 వినతి పత్రాలు భూ సమస్యలకు సంబంధించినవే ఉంటున్నాయంటే.. గ్రామాల్లో భూ సమస్యలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అధిక శాతం ఘర్షణలకు కారణం భూ సమస్యలే ఉంటున్నాయని పోలీసులు పేర్కొంటున్నారు. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం రీసర్వేకు శ్రీకారం చుట్టింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొలతలు వేసి హద్దులు చూపి రాళ్లు సైతం పాతి హక్కు పత్రాలు అందజేస్తుంది. సమస్యలు వేగంగా పరిష్కారమవుతుండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఫొటోలో భూ హక్కు పత్రం చూపుతున్న రైతు పేరు పింజరి ఉసేన్. కామవరం గ్రామస్తుడు. 'సర్వే నంబర్ 314లో తన కున్న 3.32 ఎకరాల్లో తన భూమి కొలతలు సరిగా లేకపోవడంతో తక్కువగా ఉందని కొన్నేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోయింది. ఇక తన సమస్య ఇలాగే ఉండిపోవాల్సి వస్తుందేమనని, భవిష్యత్‌లో తన పిల్లలకు ఏదైనా ఇబ్బందిగా మారుతుందేమోనని ఆందోళనగా ఉండేది. అయితే జగనన్న ప్రభుత్వం ఉచితంగా డ్రోన్లతో సర్వే చేసి నా భూమిని నాకు కచ్చితమైన కొలతలతో రికార్డుల్లో ఉన్నట్లు చూపి హద్దు రాళ్ల పాతి శాశ్వత హక్కు పత్రం అందజేశారు. ప్రస్తుతం భూ సమస్యకు సంబంధించిన ఆలోచనే లేదు, నిర్భయంగా ఉంటున్నా'. అని చెబుతున్నాడు.

- 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష' తో దశాబ్దాల కాలం నాటి సమస్యలకు చెక్
- సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తున్న సర్వేయర్లు
- ఆధునిక పరిజ్ఞానంతో సర్వే
- కౌతాళం మండలంలో 17 గ్రామాల్లో పూర్తి
- ఆరు గ్రామాల రైతులకు హక్కు పత్రాల అందజేత
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



ఉరుకుందలో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది



సర్వే రికార్డుల్ని పరిశీలించుకుంటున్న రైతన్నలు

కౌతాళం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకంతో పల్లెల్లో అధిక శాతం భూ సమస్యలు పరిష్కారమవుతున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా నెలకొన్న సమస్యలకు రీ సర్వే పరిష్కారం చూపుతుందని చెబుతున్నారు. రాష్ట్రంలో పేరుకు పోయిన భూ సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం తీసుకొచ్చింది. ఇప్పటికే దాదాపు మొదటి విడత రీ సర్వే పూర్తవగా, రెండో విడత వేగంగా సాగుతోంది. మొదటి విడతలో సర్వే పూర్తయిన భూములకు సంబంధించి ప్రభుత్వం హక్కు పత్రాలను సంబంధిత రైతులకు అందజేసింది.

మండలంలో..

కౌతాళం మండలంలోని 36 గ్రామాల్లో మొత్తం 93,246 ఎకరాల భూమి ఉండగా.. 25,838మంది రైతులు ఉన్నారు. మొదటి విడతలో 6గ్రామాల్లో రీసర్వే పూర్తవగా రైతులకు హక్కు పత్రాలను అందజేశారు. రెండవ విడతలో 11 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యింది. లింగాలదిన్నె గ్రామంలో 1,284 ఎకరాలకు గాను 310 మంది రైతులు ఉన్నారు, వీరాలదిన్నెలో 878 ఎకరాలకు గాను 309మంది రైతులు ఉన్నారు. మదిర గ్రామంలో 366 ఎకరాలకు గాను 173 మంది రైతులు ఉన్నారు. గుర్రాలదొడ్డిలో 290 ఎకరాలకు గాను 100 మంది రైతులు ఉన్నారు. అలాగే గొతులదొడ్డిలో 575 ఎకరాలకు గాను 147మంది రైతులు ఉన్నారు. ఆయా గ్రామాల్లో రైతుల పొలాలకు హద్దులు చూపడంతో పాటు అందుకు సంబంధించిన మ్యాప్ ఇవ్వడంతో పాటు పొలాల హద్దుల వద్ద ప్రభుత్వమే రాళ్లను ఏర్పాటు చేసింది. ఇక రెండవ విడతలో తోవి గ్రామంలో 724 ఎకరాలు, కామవరంలో 1,268 ఎకరాలు, ఉరుకుందలో 1,218 ఎకారలు, బంటకుంటలో 540ఎకరాలు, కాత్రికిలో 963 ఎకరాలు, సుళేకేరిలో 674 ఎకరాలు, అగసలదిన్నెలో 518 ఎకరాలు, డంబలదిన్నెలో 450 ఎకరాలు, చూడిలో 1,063 ఎకరాలు, పొదలకుంట గ్రామంలో 269 ఎకరాల్లో రీ సర్వే ముగించారు. అలాగే వీటికి తోడు చుక్కల భూములకు, క్లెయిమ్ కాని భూములకు కూడా పరిష్కారం లభించిందని రైతులు పేర్కొంటున్నారు.

సర్వే ఇలా..

రీ సర్వేలో భాగంగా నిర్దేశిత సర్వే నంబర్‌ను మ్యాప్,గత రికార్డులు, రైతుల పట్టాల ఆధారంగా మొత్తం భూమిని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్లు, రోవర్ల ద్వారా కొలతలు వేసి హద్దులు నిర్దేశిస్తున్నారు. చివరగా ఉచితంగా హద్దు రాళ్లు సైతం పాతుతున్నారు. చివరగా ఆ భూమికి సంబంధించిన శాశ్వత హక్కు పత్రాలను అందజేస్తుంది.

రస్తాలు బయటపడ్డాయి.. భూమి వచ్చింది



నాకు ఉన్న 2.93 ఎకరాల భూమికి రీసర్వే వల్ల శాశ్వత పరిష్కారం దొరికింది. నాకు కొంత వరకు భూమి వచ్చింది. గత 50 సంవత్సరాల నుంచి జరగని పని ఈ ప్రభుత్వం వచ్చి చేసింది. రీసర్వే వల్ల చాలా బండి రస్తాలు ఉన్నట్లు వెల్లడైంది. దీంతో రైతులు తిరగడానికి అనుకూలంగా మారింది. ఇలాంటి శాశ్వత పనులు చేసి అందరి మదిలో నిలిచిపోయేలా జగనన్న చేశారు.

–అలీ అక్బర్, కామవరం

రీ సర్వే ఎంతో ఉపయోగం



ఏ ప్రభుత్వం చేయని పనిని జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించాడు. పొలాల హద్దులను జీపీఎస్, డ్రోన్ ద్వారా ఏర్పాటు చేసి వాటికి హద్దు రాళ్ల వేసి శాశ్వత పరిష్కారం చూపించారు. ఇలా రైతులకు ఉపయోగపడే పనులు చేస్తే బాగుంటుంది.

– అయ్యప్ప, కామవరం

రీసర్వే ముమ్మరంగా సాగుతోంది

మండలంలో రీసర్వే ముమ్మరంగా సాగుతోంది. మొదటి విడతలో 6గ్రామాల్లో సర్వేను పూర్తి చేయగా, రెండవ విడతల్లో 11గ్రామాల్లో సర్వే దాదాపు పూర్తి చేశాం. రెండు, మూడు గ్రామాలకు సంబంధించి జేసీ లాగిన్‌లో పెండింగ్ ఉన్నాయి. మిగిలిన 19 గ్రామాల్లో రీసర్వేను మూడవ విడతలో పూర్తి చేస్తాం.

– రామేశ్వర రెడ్డి, తహసీల్దార్

సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు..



పరసముల్లా వీధిలో సమస్యలను తెలుసుకుంటున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జగనన్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభింపజేశారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువనాయకుడు మనోజ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 27వ వార్డు పరసముల్లా వీధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ తిరిగి పథకాల అమలు, చేకూరిన లబ్ధిని వివరించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు చంద్రబాబు రాష్ట్రాన్ని పాలించినా లాభం లేకపోయిందన్నా రు. జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో 95 శాతం హామీలను నెరవేర్చి ప్రజల మనస్సును చూరగొ న్నారని కొనియాడారు. మోసపూరిత మాటలు చెబుతూ మభ్యపెట్టేందుకు టీడీపీ నాయకులు వస్తారని, వారి మాటలను నమ్మవద్దని, సంక్షేమ పాలనాదీశుడు జగన్‌కే ఆశీర్వాదం అందించి మళ్లీ సీఎంను చేద్దామని, అందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. వైస్ చైర్మన్‌లు నరసింహులు, గౌస్, కౌన్సిలర్ ఫయాజ్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ నియాజ్‌అహ్మద్, నాయకులు సింహంనాగేంద్ర, మహ్మద్‌స్వామి, ఖాదర్, వార్డు ఇన్‌చార్జ్ హాజీఖాదర్ రహీం పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి



రౌడూరులో జెండా ఆవిష్కరణ చేస్తున్న నాయకులు



జెండావిష్కరణ చేస్తున్న విశ్వనాథ్ రెడ్డి

రాష్ట్రానికి చంద్రబాబు చేసిందేమీ లేదు



జెండావిష్కరణగావిస్తున్న జేసీఎస్ మండల కన్వీనర్ మురళీ మోహన్ రెడ్డి

ఆదోనిటౌన్: తాను ముఖ్యమంత్రిగా 14ఏళ్లు పనిచేశానని చెప్పుకునే చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి చేసిందేమీ లేదని, తాను అమలు చేశానని చెప్పుకునేందుకు ఒక్క పథకం కూడా లేదంటే ఆయన ఎలా పాలించారో అర్థం చేసుకోవచ్చని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి తనయుడు, యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. అయితే పేదలను ఆదుకునేందుకు నాలుగున్నరేళ్లలో నవరత్నాల పేరుతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసి జనం గుండెల్లో చెరిగిపోని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. బుధవారం పట్టణంలోని 26వ వార్డు వెంకన్నపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని వార్డు ఇన్‌చార్జ్ మల్లికార్జునతో కలిసి నిర్వహించారు. ముందుగా వార్డులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. వార్డులో సంక్షేమ పథకాలు, చేపట్టిన పనుల వివరాలను తెలియజేసే డిస్‌ప్లే బోర్డును ప్రదర్శించారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు అడిగే హక్కు లేదన్నారు. జనసేన, టీడీపీ కుమ్మక్కై ప్రజల ముందుకు వస్తున్నారని, వారి మోసపూర్తి మాటలు నమ్మొద్దని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, కన్వీనర్ మధుసూదనశర్మ, క్లస్టర్-1 అధ్యక్షుడు మమ్మెత్తి స్వామి, నాయకులు సింహం నాగేంద్ర, రమేష్, నల్లారెడ్డి, ప్రకాష్, రాము, చంద్రకాశి, వీరస్వామి, నూర్‌బాషా పాల్గొన్నారు.

కోసిగి: వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని జేసీఎస్ మండల కన్వీనర్ పి. మురళీ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆర్లబండ గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ల, గృహసారథులతో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ కార్యాలయంకు వరకు ర్యాలీగా వెళ్లి సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. అనంతరం వలంటీర్లు ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్స్‌ను పంపిణీ సంక్షేమ లబ్ధి, అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, బుళ్లి నరసింహులు, నాయకులు గొళ్ల పరుశురామ్, ఎంపీటీసీ తాయమ్మ, హనుమప్ప, ఆనంద్,గాదిరెడ్డి,వెంకన్న, హనుమంతు, ఇస్మాయిల్, నరసప్ప,ఆంజనేయలు పాల్గొన్నారు.

కౌతాళం: ప్రతి ఇంటికి నవరత్నాలతో సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగనన్నదేనని రౌడూరు గ్రామ సర్పంచ్ సుశీల, గ్రామ ఇన్‌చార్జ్ పాండురెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ వెంకటరామిరెడ్డి కొనియాడారు. బుధవారం మండలంలోని రౌడూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూపర్‌రింటెండెంట్ సత్యన్న, కార్యదర్శి అబ్దుల్‌వాహిద్, నాయకులు సుధాకర్‌రెడ్డి, సోమరెడ్డి, నర్సారెడ్డి, కిష్టప్ప పాల్గొన్నారు.

మంత్రాలయం : మండలంలోని రాంపురం గ్రామంలో బుధవారం ఏపీ వై నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా పార్టీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి ఆవిష్కరించారు.సచివాలయ కార్యాలయంలో సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కోసిగి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పి.మురళీమోహన్ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ప్రభుత్వం కోసిగిని కరువు మండలంగా ప్రకటించిందని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందజేస్తుందని, ఇప్పటికే పంట నష్ట నమోదుపై నివేదికలు రూపొందించినట్లు ఏఓ రాజు తెలిపారు. గ్రామీణ ఆర్అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఏఈ పాయి సురేష్‌కు సూచించారు. ఓటరు జాబితాలో తప్పులుంటే సరిచేసుకోవాలని తహసీల్దార్ రుద్రగౌడ సూచించారు. నాడు-నేడు కింద పనులు వేగవంతంగా చేసేలా చూడాలని ఏఈ రంగరాజు సర్పంచ్‌లకు సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జలజీవన్ మిషన్ కింద ఇంటింటా కులాయి ఏర్పాటు ముమ్మరంగా పనులు సాగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షుడు బెట్టన గౌడ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో పీఠాధిపతి



శ్రీవారి సన్నిదిలో పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం : కార్తీకమాసం ఆనవాయితీలో భాగంగా రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు కలియుగ దైవం తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. బుధవారం పీఠాధిపతి తిరుమలకు చేరుకోగా.. టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికగా.. ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి..టీటీడీ ఈఓ, ఇతర అధికారులకు శేషవస్త్రం, రాఘవేంద్రుల జ్ఞాపికను అందజేసి ఫలమంత్రాక్షింతలతో ఆశీర్వాదించారు.





లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అంబాభవానీకి ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఫారెస్ట్‌లైన్‌లో అంబాభవానీ దేవస్థానంలో లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు బుధవారం దేవస్థాన సమితి సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాదాపు 300 మంది మహిళలు పాల్గొని లలితా సహస్రనామ పారాయణ కార్యక్రమం చేపట్టారు.

ఫీజులు రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా కోరారు. బుధవారం స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహ అవరణలో జరిగిన 6వ పట్టణ మహాసభలో ఆయన మాట్లాడుతూ వర్షాలు లేక కరువుతో ఉపాధి కోసం అనేకమంది వలస వెళ్తున్నారని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ఫీజుల పేరుతో విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. కళాశాల ఫీజు కడితేనే పరీక్ష రుసుం కట్టించుకుంటామని చెబుతుండటంతో ఏమి చేయాలో పాలుపోక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. జిల్లాలో సీజనల్ వసతి గృహాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

3న కార్తీక వనభోజనం

ఆదోనిఅర్బన్: డిసెంబర్ 3వ తేదీన కురువల 21వ కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తామని కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి, సహాయ కార్యదర్శి బూదూరు లక్ష్మన్న తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. కర్నూలులోని పెద్దపాడు రోడ్డులో వెలిసిన శ్రీ ధీరలింగేశ్వరస్వామి ప్రాంగణంలో కురువల కార్తీక వనభోజన మహోత్సవం ఉంటుందని, అలాగే భక్తకనకదాసు 336 జయంతి వేడుకలు ఉంటాయని చెప్పారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో జరిగిన అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థిని బి.సాహిత్య పాల్గొని ప్రతిభ చూపిందని మల్లికార్జున విద్యాలయం పాఠశాల కరస్పాండెంట్ కె.సుగూరప్ప బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అండర్-14 విభాగంలో అన్నమయ్య జిల్లా చిట్‌వేల్ గ్రామంలో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురితో కలిసి అభినందించారు.

మేటీలు బాధ్యతలు తెలుసుకోవాలి



పెద్దకడబూరులో మేటీలకు ప్రయోగపూర్వకంగా శిక్షణ ఇస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మేటీలు తమ విధులు, బాధ్యతలను తెలుసుకొని బాధ్యతాయుతంగా పనులు చేయించాలని ఏపీఓ రామన్న తెలిపారు. ఎంపీడీఓ ప్రభాకర్ ఆధ్వర్యంలో మండలంలో రిజిస్టర్ అయిన 218 మంది మేటీల్లో 50మందికి ఏపీఓ రామన్న, ఈసీ ఖాదర్‌బాషా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విధులు, బాధ్యతలతో పాటు డిమాండ్ ఎలా తీసుకోవాలి, వర్క్ లొకేషన్, మస్టర్‌లలో హాజరు వేయడం, మొబైల్‌లో మొదటి, రెండవ ఫొటోలను అప్‌లోడ్ చేయడం, పనులకు కొలతలు, మార్కింగ్ ఇవ్వడం, పండ్ల తోటల పెంపకం, వలసలు నివారించడం, జాబ్ కార్డ్ అప్‌డేట్ చేయడం తదితర వాటిపై ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న బాలికలు

క్రీడాకారిణులకు ప్రత్యేక శిక్షణ

ఆదోని సెంట్రల్: అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు బాలకల జట్టుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు కోచ్ వ్యాయామ ఉపాధ్యాయుడు రామన్న బుధవారం తెలిపారు. ఆర్ట్స్ కళాశాల అవరణలో జిల్లాలోని కర్నూలు, బనగానపల్లె, డోన్, పల్లెపాడు, పెద్దహరివాణం పాఠశాలల నుంచి 12 మంది విద్యార్థినులతో కూడిన జట్టుకు శిక్షణ ఇసున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయిన తరువాత చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. టీం మేనేజర్ హరిత, పీఈటీలు నరసింహులు, గంగాధర్ సహకరిస్తున్నారన్నారు.